# బీఆర్ఎస్ నాయకులవి పగటి కలలు

## ఉప ఎన్నికలో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి ● రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు


కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న మంత్రి జూపల్లి

ఎర్రగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకులు పగటి కలలు కంటున్నారని, గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కూడా ఆ పార్టీకి ప్రజలు మరోసారి బుద్ధి చెబుతారని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి ఆయన ఎర్రగడ్డ, బోరబండ, సాయి బాబానగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదని అడ్డగోలుగా రాష్ట్రాన్ని నిలువునా దోచుకుని బాకీ కార్డు పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను లూటీ చేసిన కేసీఆర్ కుటుంబమే రౌడీ కుటుంబం అని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే మంచివారని.. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి ఎన్నికల బరిలో ఉంటే రౌడీషీటర్లు అంటారా అని నిలదీశారు. దోచుకున్న డబ్బుతో విచ్చలవిడిగా ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్


నవీన్ యాదవ్ సతీమణి వర్ష ప్రచారం


బోరబండ వినాయకనగర్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

# కోట్లాది రూపాయలతో అభివృద్ధి

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్

బంజారాహిల్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పాదయాత్ర నిర్వహించి ఓటు వేయాలని అభ్యర్థించారు. దివ్యాంగులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షాల మాటలు విని మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి, దినేష్‌గౌడ్, గురునాథ రావు, నాగరాజు, భరత్ కుమార్ పాల్గొన్నారు.

### ప్రొఫెషనల్ కాంగ్రెస్ టీషర్ట్‌లు

ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆదిత్యరెడ్డి రూపొందించిన టీషర్ట్‌లను నవీన్‌యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం ఆదిత్యరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భారీ మెజార్టీతో నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు.


ప్రొఫెషనల్ కాంగ్రెస్ టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న నవీన్‌యాదవ్, డాక్టర్ ఆదిత్యరెడ్డి

### కాంగ్రెస్‌దే విజయం : దేప భాస్కర్‌రెడ్డి

ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. యూసుఫ్ గూడ, రహ్మత్‌నగర్‌లో ఆయన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర చేశారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు మద్దతుగా నవీన్ యాదవ్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి

### విజయారెడ్డి పాదయాత్ర

నవీన్ యాదవ్‌కు మద్దతుగా బోరబండ డివిజన్ వినాయకరావు నగర్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే మురళీకృష్ణ, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, అశోక్, ఆనంద్, రవీందర్, సురేందర్, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు


ముఖ్యమంత్రి సమక్షంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు షరీఫ్ ఖురేషికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్


మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాము తదితరులు

ఎర్రగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు భారీగా పెరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి బుధవారం తన అనుచరులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ షరీఫ్ ఖురేషికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు అంజద్ అలీ, ఎండీ జావిద్, ఎండీ ఆసిఫ్ కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.రాము తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్, నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, నరేష్ పాల్గొన్నారు.

# జోష్ నింపిన సీఎం రోడ్ షో

● భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

యూసుఫ్‌గూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోలు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపాయి. బుధవారం రాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో నిర్వహించిన రోడ్ షోకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి సీఎం రోడ్ షో సందర్భంగా నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు యూసుఫ్‌గూడకు చేరుకోవడంతో సందడి నెలకొంది. యువత, మహిళలు రోడ్ షోకు భారీగా తరలిరావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు రఘు కళాబృందం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డిపై పాడిన పాటలు నేతల్లో ఉత్సాహం నింపాయి.

## జూబ్లీహిల్స్‌ను పట్టించుకోని కిషన్‌రెడ్డి

### టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్


ప్రచారం చేస్తున్న బండి సుధాకర్‌గౌడ్

బంజారాహిల్స్/బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుడిగానూ, కేంద్రమంత్రిగానూ ఉన్నప్పటికీ జూబ్లీహిల్స్ అభివృద్ధిని పట్టించుకోని కిషన్‌రెడ్డి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ ప్రశ్నించారు. రహ్మత్‌నగర్‌లో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలపుడు ప్రజలకిచ్చిన వాగ్దానాలను రేవంత్ సర్కార్ ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే, ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి పేదవాడి బ్యాంక్ అకౌంట్‌లో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, 70 వేలకు పైగా కొత్త ఉద్యోగాలు ఇచ్చినట్టు గుర్తు చేశారు. నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బోరబండలో నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, ఎమ్మెల్యేలు డా.చిక్కుడు వంశీకృష్ణ, మందుల సామేల్, పీజేఆర్ తనయ పి.విజయారెడ్డి, బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ తదితరులు ప్రచారం చేశారు. జూబ్లీ హిల్స్ సర్వతోముఖాభివృద్ధికి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న లీగ్ ప్రతినిధులు

## జనవరిలో ప్రో రెజ్లింగ్ లీగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీఆర్ఎల్)ను తిరిగి ప్రారంభించాలని జాతీయ రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) నిర్ణయించింది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో లీగ్‌ను పునప్రారంభిస్తున్నట్టు పీఆర్ఎల్ సీఈఓ అఖిల్ తెలిపారు. ఈ లీగ్‌లో హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా బరిలోకి దిగనుంది. 2019లో నిలిచిపోయిన ఈ లీగ్‌ను తిరిగి జనవరిలో ప్రారంభిస్తున్నామని డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది. రెజ్లింగ్ మన వారసత్వ క్రీడ అని, దేశంలో ఎందరో ప్రతిభావంతులైన రెజ్లర్లు ఉన్నారని, వారికి ఈ లీగ్ ఒక వేదిక కానుందని అఖిల్ తెలిపారు.


సర్టిఫికెట్ అందుకున్న అభ్యర్థులతో నిర్వాహకులు

## కంప్యూటర్ సర్టిఫికెట్ల ప్రదానం

అమీర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కమ్మసంఘం అమీర్‌పేట ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ద్వారా కంప్యూటర్ బేసిక్స్‌లో 60 రోజులుగా ఉచిత శిక్షణ తీసుకుంటున్న 60 మంది అభ్యర్థులకు బుధవారం సంస్థ ఆవరణలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ మాట్లాడుతూ సంఘం తరఫున కులాలకు అతీతంగా అందరికీ ఉచితంగా కంప్యూటర్ బేసిక్స్‌లో శిక్షణ నిర్వహిస్తునట్లు తెలిపారు. తదుపరి బ్యాచ్‌కు అభ్యర్థుల ఎంపికకు ఇంటర్వ్యూలు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు గంటలకు కమ్మసంఘం కార్యాలయంలో జరుగుతాయని, 12న తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849566945, 9177661161లో సంప్రదించాలని సూచించారు.


లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

## లక్ష్మయ్య సేవలు మరువలేం

యూసుఫ్‌గూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం బలోపేతానికి లక్ష్మయ్య చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని మున్నూరుకాపు మహాసభ కాచిగూడ ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్, చైర్మన్ మామిడాల రాజు అన్నారు. బుధవారం కృష్ణానగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పెరుక లక్ష్మయ్య ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుడుగు రవీందర్, చల్లా హరిశంకర్, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, కోల శివకుమార్ పాల్గొన్నారు.

## మాలలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

ఖైరతాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మాలలు సంఘటితమై హక్కులను సాధించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం లక్డీకాపూల్‌లోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మాలలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల మాలలతో తమకు జరుగుతున్న అన్యాయం, హక్కుల సాధన కోసం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో మాల మహానాడు నేతలు బందెల రాజభద్రయ్య, యాద లక్ష్మి, ఎంవీ రాజు, సమత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి విజయం ఖాయం


సమావేశంలో;బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

పంజాగుట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ-జనసేన భాగస్వామ్యంతో తెలంగాణలో మార్పు అనివార్యమని, భవిష్యత్ బీజేపీదే అని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి విజయం ఖాయమని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బీజేపీ అభ్యర్థికి జనసేన మద్దతు ప్రకటించింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఎన్.శంకర్‌గౌడ్‌తో కలిసి వారు మాట్లాడారు. జనసేన మద్దతు శుభపరిణామమని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కుంభకోణాలు మాత్రమే జరిగాయని, బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం తప్ప మిగతా వర్గాలు బాగు పడలేదని విమర్శించారు. తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి తరఫున ప్రచారం చేయడమే కాకుండా ఆయనను గెలిపిస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఎన్.శంకర్‌గౌడ్ అన్నారు. సమావేశంలో బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కావాలంటే బీజేపీని గెలిపించాలి

● ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు మాధవ్

బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మాధవ్ కోరారు. బోరబండ బలహీనవర్గాల కాలనీలో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కేంద్రం నిధులతో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కాషాయ జెండా రెపరెపలాడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో హన్మకొండ మాజీ ఎమ్మెల్యే రంగారావు, బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్, పూజారి చరణ్‌రెడ్డి, తీగల కృష్ణ, కుమార్ పవార్, రాజేష్ పాల్గొన్నారు.


బలహీనవర్గాల కాలనీలో ప్రచారం చేస్తున్న మాధవ్

# మరోసారి గులాబీ జెండా ఎగరాలి


పండ్ల వ్యాపారులను ఓటు అడుగుతున్న మాగంటి సునీత

యూసుఫ్‌గూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో మరోసారి గులాబీ జెండా ఎగరాలని మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి వారు బుధవారం వెంకటగిరిలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, అయేషా, సామల హేమ, నివేదితసాయన్న, నీలం సంతోష్ పాల్గొన్నారు.

### కక్ష సాధింపు చర్యలు

బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. శ్రీరామ్ నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ కార్యక్రమాల కోసం తన ఇంటిని ఇచ్చినందుకు మాజీ కార్పొరేటర్ ఎం.ఏ.షఫీకి చెందిన హోటల్‌ను సీజ్ చేయించారని తెలిపారు. అలాగే, పండ్ల వ్యాపారం చేసే సమద్ అనే బీఆర్ఎస్ నాయకుడి బట్టీని మూసి వేయించారని ఆరోపించారు.

## యువకుడు ఆత్మహత్యాయత్నం

హైటెక్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కొబ్బరితోటకు చెందిన శ్రీనివాసరావు కుమారుడు దుర్గా ప్రసాద్(27) కుటుంబ కలహాల కారణంగా మంగళవారం ఇంటి నుంచి రైలులో బయలుదేరి హైదరాబాద్ వచ్చాడు. అక్కడ క్యాబ్ మాట్లాడుకుని రాయదుర్గం మెట్రోస్టేషన్ వద్దకు వచ్చాడు. అక్కడున్న ఓ హోటల్లో టిఫిన్ చేసేందుకు లోపలకు వెళ్లిన దుర్గాప్రసాద్ అక్కడ కాయకూరలు కోసే కత్తి తీసుకుని పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాంతో భయపడిన క్యాబ్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అతడికి ఇటీవల వివాహం అయినట్లు తెలిసింది. పూర్తి వివరాలు అతడి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

## రేషన్ బియ్యం సీజ్.. ఒకరి అరెస్ట్

ఖైరతాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలించేందుకు పెద్ద ఎత్తున నిల్వ ఉంచగా సెంట్రల్ జోన్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో సెంట్రల్ జోన్ పోలీసులు ఖైరతాబాద్ పోలీసుల సహకారంతో బీజేఆర్ నగర్‌లో తనిఖీలు చేస్తున్నారు. ఖైరతాబాద్ బీజేఆర్ నగర్‌కు చెందిన మహ్మద్ అజర్ (24) తన ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యాన్ని తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. బియ్యాన్ని నిల్వ ఉంచే ప్రాంతాన్ని అజర్ చూపించాడు. అక్కడ 27 ప్లాస్టిక్ బ్యాగుల్లో వెయ్యి కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి యువకుడితో పాటు బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, బియ్యాన్ని నిల్వ ఉంచిన ఇల్లు అబ్దుల్ రహమాన్‌ది అని, అతడిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు


ప్రత్యేకంగా అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట/ఖైరతాబాద్/బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శివ నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. అమీర్‌పేట డివిజన్‌లోని బల్కంపేట ఎల్లమ్మ, సాయిబాబా, హనుమాన్ ఆలయాల్లో శివలింగాలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ ధర్మకర్తలతో కలిసి శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఈవో జయంతి, ట్రస్టీ చైర్మన్ సత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు. బల్కంపేట ఎల్లమ్మను ప్రత్యేక దివ్వెలు, పూలు, పండ్లు, స్వీట్లు, ఉసిరి కాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్తీక దీపోత్సవాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈవో శేఖర్, సూపరింటెండెంట్ హైమావతి, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఖైరతాబాద్‌లోని ఏడుగుళ్ల ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. ఆలయ అర్చకులు రాజేష్ స్వామి ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ముద్రణాలయం ఎదురుగా ఉన్న శివాలయం, ఎన్టీఆర్ మార్గంలోని హనుమాన్ ఆలయంలోని శివాలయం, మింట్ కాంపౌండ్ త్రిశక్తి హనుమాన్ ఆలయంలోని శివలింగం, రాజ్‌నగర్ హనుమాన్ ఆలయంలోని శివాలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. బోరబండ స్వరాజ్ నగర్ శ్రీ హరిహర క్షేత్రం శివాలయంలో సత్యనారాయణ వ్రతం చేశారు. కాగా, అమీర్‌పేట కనకదుర్గ ఆలయం వద్ద ఎస్ఆర్‌నగర్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. మాగ్నస్ డయాగ్నస్టిక్స్ నిర్వాహకుడు, హనుమాన్ ఆలయం ధర్మకర్త సింగం శ్రీనివాస్‌రావు ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ పేర్కొన్నారు.


ఎల్లమ్మ ఆలయంలో శివ లింగానికి అభిషేకం చేస్తున్న చైర్మన్ సాయిబాబాగౌడ్



అయ్యప్ప ఆలయంలో మాలధారణలో భక్తులు

# స్వామియే శరణం అయ్యప్ప

- కిక్కిరిసిన మెట్టుగూడ ఆలయం
- 2 వేల మంది మాలధారణ
- 10 వేల మంది భక్తుల హాజరు

**చిలకలగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):** మెట్టుగూడ అయ్యప్ప ఆలయం బుధవారం అయ్యప్ప మాలధారులు, భక్తులతో కిటకిటలాడింది. స్వామి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా 2 వేల మంది భక్తులు, అయ్యప్ప మాలాధారణకు తరలివచ్చారు. నవంబరు 17 నుంచి భక్తులకు మధ్యాహ్న భిక్షతో పాటు సాయంత్రం అల్పాహారం ఏర్పాటు, భజనకు అవసరమైన ఏర్పాట్లు గావిస్తున్నారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధ్యక్షుడు చలువాది రవీందర్, ఆలయ ప్రధాన కార్యదర్శి ఆర్ .సునీల్ కుమార్ నాయర్, కోశాధికారి కె.పి. రవీంద్రన్, సదాశివన్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 10 వేల మంది భక్తులు తరలి రాగా ఇరుకు రోడ్డు రీత్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

## వైద్యవిద్యార్థినికి రూ. 2.31 లక్షల సాయం

**చిలకలగూడ, నవంబరు5 (ఆంధ్రజ్యోతి):** వైద్యవిద్యార్థిని.. కాలేజీ ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకొన్న యువతి బంధువులు, మిత్రులు, రైల్వే బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య వారు తమ వంతుగా రూ. 2.31 లక్షలు అందజేశారు. విషయానికొస్తే.. కొమ్మమూరి ప్రియంవద దంపతులకు ఇద్దరు కుమార్తెలు. తల్లి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్ద కుమార్తె తేజస్వికి.. నీట్ 2025లో 477 ర్యాంకు వచ్చింది. దీంతో తిరుపతిలోని అన్నా గౌరి మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు పొందింది. కాని కాలేజీ ఫీజు కట్టలేని పరిస్థితి. ఈవిషయం తెలుసుకొన్న బంధువులు తదితరులు ఆర్థిక సహాయం అందజేశారు. వారికి తల్లి ప్రియంవద ధన్యవాదాలు తెలిపారు. కాగా, యువతి తండ్రి చనిపోయాడు.



బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి దంపతులు బుధవారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. తార్నాకలో ఉన్న వారి నివాసంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, ఏబీవీపీ జాతీయ నాయకుడు గుంత లక్ష్మణ్, కిసాన్ మోర్చా లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కార్పొరేటర్ కొంతం దీపిక హాజరయ్యారు. వారి వెంట పలువురు బీజేపీ నాయకులు, పోలీసు అధికారులు ఉన్నారు. - **తార్నాక, ఆంధ్రజ్యోతి**









మహంకాళి అమ్మవారి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

# శివోహం

- శివనామస్మరణతో హోరెత్తిన లష్కర్
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**సికింద్రాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):** శివ నామ స్మరణతో లష్కర్‌లోని ఆలయాలు హోరెత్తాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలన్నీ బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు జరిపారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలోని కాలనీలు, బస్తీలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ హోమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. బోయినపల్లి హనుమాన్ ఆలయంలో కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మాజీ సభ్యుడు కె.పాండుయాదవ్‌లు అన్నప్రసాద పంపిణీని ప్రారంభించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ హైదర్‌బస్తీలో వరుసగా 17వ యేటా కూడా బీజేపీ నాయకుడు చీర సత్యనారాయణ కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

### ఆధ్యాత్మిక శోభ

**బౌద్ధనగర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి):** కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బుధవారం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లో ఉన్న పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శ్రీనివాస్‌నగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతాల్లో దంపతులు పాల్గొన్నారు. నామాలగుండు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయచైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరా దంపతుల ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. సీతాఫల్‌మండి రామలింగేశ్వరస్వామి ఆలయం, నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయం, బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం, మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయం, చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో జరిగిన కార్తీక పౌర్ణమి వేడుకల్లో మహిళలు.. దీపారాధన, ప్రత్యేక పూజలు చేశారు.



### సామూహిక వ్రతాలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా మారేడుపల్లి.. సుబ్రమణేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాన్ని దంపతులు ఆచరించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ పాలకమండలి కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.
- **(మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి):**



### ఓంకార రూపం దర్శనం

ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో జ్వాలా తోరణాన్ని వెలిగించారు. మంటల్లో ఓంకారం దర్శనం ఇచ్చింది. దీన్ని సెల్‌ఫోన్‌లలో భక్తులు చిత్రీకరించారు.



తిరుమలగిరి: అన్నదానం చేస్తున్న నరసింహన్

### ప్రత్యేక పూజలు

**తిరుమలగిరి నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బొల్లారం డౌటన్ బజార్.. భూలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారికి బుధవారం భక్తులు అభిషేకం, అర్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్, కనిష్క, నరేందర్, బాల్‌రాజ్, పూర్ణచందర్, ఖన్నా, సతీష్, రజనికాంత్‌లు పాల్గొన్నారు. లాల్‌బజార్.. మహంకాళి దేవాలయంలోనూ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ప్రసాద వితరణ గావించారు.



మహంకాళి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నామాలగుండు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయచైర్మన్ ప్రకాశరావుఇందిరా



ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు



హనుమాన్ ఆలయంలో అన్నదానం చేస్తున్న జంపన, పాండుయాదవ్



హైదర్‌బస్తీలో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న చీర సత్యనారాయణ తదితరులు



తాడ్‌బండ్ శివాలయం వద్ద అన్నదానం చేస్తున్న కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్, నాయకులు, కార్యకర్తలు

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్

**తార్నాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గాలి వినోద్ కుమార్.. నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. జీహెచ్‌ఎంసీలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా బుధవారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తలు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీని బూత్ స్థాయి నుంచే పటిష్టం చేయాలని సూచించారు. జనవరి 3 సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని స్ఫూర్తి దివస్ పేరుతో సరూర్‌నగర్ స్టేడియంలో వేలాది మంది మహిళలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి డా. బీఆర్ అంబేడ్కర్ మనవడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణ ఇన్‌చార్జి డా. మేజర్ చంద్రకాంత్, కోశాధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

### గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలిగా వనజ

అనంతరం రాష్ట్రస్థాయి మహిళా కమిటీని ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్. కావేరి, జాయింట్ సెక్రటరీగా జె. వసంత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలిగా డా. వనజ, కమిటీ సభ్యులుగా జమున, మేడారం, కె. భార్గవిలు నియమితులయ్యారు.



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు

## మురుగు.. రోడ్డుపై పరుగు

- వెదజల్లుతున్న దుర్వాసన.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

**బోయినపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** కంటోన్మెంట్ బోర్డు అధికారుల నిర్లక్ష్యానికి ఆరో వార్డు నెల్లూరు పోచమ్మ ఆలయం.. మర్రి రామ్ రెడ్డి కాలనీ రోడ్డుపై నిలిచిన మురుగు నిదర్శనంగా నిలుస్తోంది. ఇటీవల అకస్మాత్తుగా కురిసిన వర్షాలతో కాలువలు పొంగి డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరింది. ఇందులో నుంచి దుర్గంధం వస్తుండటంతో బోర్డు అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. అయినా పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోకపోవడంతో దుర్వాసనతో సతమతమవుతున్నారు. అంతేకాకుండా చిన్నపాటి వర్షానికి కూడా కాలువలు పొంగుతున్నాయి. మురుగు రోడ్ల పైకి రావడంతో పాటు ఇళ్లలోకి కూడా చేరుతోంది. నాలుగు రోజులుగా పరిస్థితి మరింత దారుణంగా తయారైందని వారు వాపోయారు.

## రేపటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

**రవీంద్రభారతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ 48వ వార్షికోత్సవం ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తుండటం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ రమణాచారి అన్నారు. బుధవారం రమణాచారి క్యాంప్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలు వెల్లడించారు. రేపటి నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు రవీంద్రభారతి వేదికపై మాయా వినోదం పేరిట మిమిక్రీ, మ్యాజిక్ తదితరాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులు సుమారు 64 మంది ప్రదర్శనలు ఇవ్వనున్నారని తెలిపారు.

## జనవరిలో ప్రొ రెజ్లింగ్ లీగ్

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీఆర్‌ఎల్)ను తిరిగి ప్రారంభించాలని జాతీయ రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్‌ఐ) నిర్ణయించింది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో లీగ్‌ను పున ప్రారంభిస్తున్నట్టు పీఆర్‌ఎల్ సీఈఓ అఖిల్ తెలిపారు. ఈ లీగ్‌లో హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా బరిలోకి దిగనుంది. 2019లో నిలిచిపోయిన ఈ లీగ్‌ను తిరిగి జనవరిలో ప్రారంభిస్తున్నామని డబ్ల్యూఎఫ్‌ఐ తెలిపింది.

## కంప్యూటర్ సర్టిఫికెట్ల ప్రదానం

**అమీర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):** కంప్యూటర్ బేసిక్స్‌లో ఉచిత శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు బుధవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కమ్మసంఘం అమీర్‌పేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ సంస్థ ఈ కార్యక్రమం చేపట్టింది. సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ బేసిక్స్‌లో శిక్షణ నిర్వహిస్తునట్లు తెలిపారు. తదుపరి బ్యాచ్‌కు అభ్యర్థుల ఎంపికకు ఈనెల 10వ తేదీ సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 9849566945లో సంప్రదించాలని సూచించారు.



# అంతర్గత రోడ్లు అధ్వానం

### గుంతలమయంగా మారిన వైనం

- ప్రమాదకరంగా వాహనదారుల ప్రయాణం
- స్థానికులు నడిచేందుకు సైతం ఇబ్బందులు
- సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లో దుస్థితి ఇదీ..



మహ్మద్‌గూడ ప్రధానరహదారిపై ఏర్పడిన గుంతలు, అందులో చేరిన మురుగు

**బౌద్ధనగర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి):** పలు అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మ్యాన్‌హోల్స్ లీకై మురుగునీరు గుంతల్లో చేరుతోంది. కొత్తగా వచ్చే చోదకులు ఇందులో పడి క్షతగాత్రులు అవుతున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లోని దుస్థితి ఇదీ..

- బౌద్ధనగర్ రామాలయం వద్ద ఉన్న రోడ్లకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురిస్తే వాటిలో నీరు చేరి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన సందర్భాలు చాలానే ఉన్నాయి.
- బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం వెనుక వీధి మలుపు వద్ద మ్యాన్‌హోల్స్ కుంగి నెలలు గడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో చెత్తాచెదారం పడవేస్తున్నారు.
- పాత ఇమ్మా కేఫ్, గ్రీన్‌కార్నర్ హోటల్, ఎకే పంక్షన్‌హాలు వద్ద రోడ్డుకు పెద్ద గుంతలు పడ్డాయి. కొన్ని సంవత్సరాలుగా నిత్యం రోడ్డుపై డ్రైనేజీ పారుతుంది. దీంతో స్థానికులు, వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారాసిగూడ చౌరస్తా నుంచి రోజూ వందలాది వాహనాలు మహ్మద్‌గూడ ప్రధానరహదారి మీదుగా ముషీరాబాద్, ట్యాంక్ బండ్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటాయి.
- అన్నానగర్, ఉప్పరబస్తీ, శ్రీనివాస్‌నగర్, సీతాఫల్‌మండి మేడిబావి, డెడ్‌లాక్ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లోనూ అంతర్గత రోడ్లకు గుంతలు ఏర్పడ్డాయి. కంకరతేలి ఉంది. రోడ్డుపై మురుగు నిల్వ ఉండటం, ఈ నీటిపై దోమలు వ్యాపిచెందుతున్నాయి. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులు, స్థానిక ప్రజాపతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగకపోవటంతో చీకట్లో గుంతలు పడినరోడ్డులో ద్విచక్ర వాహనాలు వెళ్తుంటే వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆగ్రహం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



బౌద్ధనగర్ రామాలయం వద్ద ఛిద్రమైన రోడ్డు





బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం వెనుక మలుపులో కుంగిన రోడ్లు

### మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం



రోడ్ల మరమ్మతుల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో అంతర్గత రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. వర్షం పడితే చాలు రోడ్లపై గుంతలు ఎక్కడ ఉన్నాయే తెలియని పరిస్థితి.

**వల్లారపు శ్రీనివాస్‌కుమార్, టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి**

### మహ్మద్‌గూడ రోడ్డులో భారీ గుంతలు



మహ్మద్‌గూడ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే చాలా భయంగా ఉంది. వర్షాలు కురిసిన తర్వాత అసలు రోడ్డుకు మరమ్మతు చేపట్టలేదు ఇప్పటికైనా ఆ పనిని పూర్తి చేయాలి.

**సాయి, జామై ఉస్మానియా**